## కేసీఆర్ ప్రభుత్వం..

ప్రతి పక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు

# రాష్ట్రంలో హ్యాట్రిక్ సాధిస్తుంది

కందుకూరు, అక్టోబర్ 1 : రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఫార్మా సిటీ సమీపంలో 300 ఎకరాల్లో ఏర్పాటు చేసే మెడికల్ కళాశాలను ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేసిన శంకుస్థాపనలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొని స్వాగత ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రతి పక్షాలకు దిమ్మతిరిగే రీతిలో కేసీఆర్ పాలన ఉందని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనను చూసి ప్రజలు బీఆర్ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువస్తారని వివరించారు. పాత రంగారెడ్డి జిల్లాలో 3 మెడికల్ కళాశాలలు ఏర్పాటు అయినట్లు తెలిపారు. గతంలో పట్టించుకోని బీజేపీ పార్టీ రాష్ట్రంపై ప్రేమ ఒలకబోస్తుందని ఎద్దేవా చేశారు.



మెడికల్ కళాశాల భవనానికి శంకుస్థాపనలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

### వైద్యం కోసం ప్రజలు హరిగోస పడ్డారు

గత ప్రభుత్వాల హయాంలో ప్రజలు వైద్యం కోసం హరిగోస పడ్డారని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి తెలిపారు. మెడికల్ వైద్య కళాశాల శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు రాష్ట్రం గురించి అసలు పట్టించుకోలేదని వివరించారు. పేద ప్రజలకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడ్డారని వివరించారు. సీఎం కేసీఆర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రజలకు అందుబాటులోకి వైద్యం తీసుకవస్తున్నట్లు వివరించారు.

### 'పాలమూరు' ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలి : ఎంపీ రంజిత్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వం పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి కోరారు. మెడికల్ కళాశాల శంకుస్థానలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీతోపాటు కేంద్ర మంత్రులు రాష్ట్రానికి రాజకీయం చేయడానికి వస్తున్నారన్నారు. మహబూబ్‌నగర్ వచ్చిన ప్రధాని మోదీ రాష్ట్రంలోనే ఉండి కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెలను చూసి కడుపు నిండితే ప్రాజెక్టుల విషయంలో మాట్లాడాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలు అంటుందని, ఎన్ని పథకాలు తీసుకవచ్చినా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ముందు ఏమి చేయలేవని తెలిపారు. కేసీఆర్ విన్నింగ్ షాట్ కొట్టడం ఖాయమని చెప్పారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డిని లక్ష మోజార్టీతో గెలిపించాలని కోరారు. పసుపు బోర్డు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. మంత్రి హరీశ్‌రావు 14 ఏండ్లపాటు రాష్ట్రం కోసం పడరాని పాట్లు పడ్డారని, అదేవిధంగా 9 ఏండ్ల నుంచి రాష్ట్రం అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు.

### రాష్ట్రానికి బీజేపీ చేసేందిఏమి లేదు : ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

రాష్ట్రానికి బీజేపీ పార్టీ చేసిందేమి లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. మెడికల్ కళాశాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. మెడికల్ కళాశాల రావడం అంత సులభం కాదని, సీఎం కేసీఆర్ పాలనకు కళాశాల రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మరింత సులభంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వివరించారు.

### అనితా హరినాథ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లాపత్ చైర్మన్ పర్సన్ ప్రతి పక్షాలకు బుద్ధి చెప్పాలి : ఎమ్మెల్సీ మల్లేశ్

రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రతి పక్షాలు పగటి కలలు కంటున్నాయని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశ్ ఎద్దేవా చేశారు. మెడికల్ కళాశాల శంకుస్థాపనలో పాల్గొని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనను చూసి ప్రతి పక్షాలు భయపడుతున్నాయని వివరించారు. ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తిరిగి ఆ పార్టీకి అధికారం ఇస్తే పాత రోజులు మళ్లీ వస్తామని వివరించారు.

## నూతన రైల్వే మార్గాన్ని ప్రారంభించిన ప్రధాని



సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : జక్లైర్-కృష్ణా నూతన రైల్వే మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా రైలు మార్గాన్ని ఆవిష్కరించారు. అనంతరం కృష్ణా రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడ వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొట్టమొదటి రైలు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ సంజయ్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## అరసం స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవాలి

### ప్రముఖ పాత్రికేయుడు శ్రీనివాస్



అరసం మహాసభలో పాల్గొని పలు పుస్తకాలు ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 1 : హిట్లర్, ముసోలినీల పాలనను తలపిస్తున్న ప్రస్తుత జాతీయ పాలకుల వైఖరి నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు అరసం పోరాట స్ఫూర్తి నేడు అవసరమని ప్రముఖ పాత్రికేయుడు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం తృతీయ మహాసభలు అబిడ్స్ బొగ్గులకుంట తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తులో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మనువాద సంస్కృతికి మళ్లీ పట్టంకట్టే ప్రయత్నాలు దేశంలో జరుగుతున్నాయని, ఇదే ధోరణి కొనసాగితే దేశ ఆర్థిక పురోగతికి అడ్డంకిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అరసం జాతీయ పతాకాన్ని ప్రముఖ కవి ఏటుకూరి ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం సృజన కారులు, పాలకులు, వ్యవస్థ అనే అంశం ఆధారంగా వేల్పుల నారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను కొందరు హిందూ ముస్లింల కొట్లాటగా చిత్రీకరిస్తున్నారని ప్రజలు గమనించాలని సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా డి.కమలారెడ్డి రచించిన నా జ్ఞాపకాలు, నాళేశ్వరం శంకరం సంపాదకత్వంలో ప్రచురితమైన దాశరథి కృష్ణమాచార్య, దర్భశయనం సంపాదకత్వం వహించిన కాళోజీ నారాయణరావు, డాక్టర్ ఎస్.రఘు సంపాదకత్వంలోని డాక్టర్ సి.నారాయణరెడ్డి పుస్తకాలను వేదికపై వక్తలు ఆవిష్కరించారు. సాయంత్రం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు పాల్గొని తమ కవితలతో ఆహుతులకు సందేశాన్ని పంచారు. ప్రజానాట్యమండలి కళాకారుల ఆటపాట ఆహుతులను విశేషంగా ఆలోచింపజేసింది. అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వీ.రామారావు, కె.వి.ఎల్ నిధి, బొమ్మగాని నాగభూషణం,చంద్రమోహన్ సభలను సమన్వయం చేశారు. అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, ఉర్దూ కవయిత్రి డాక్టర్ ఔదేశ్‌రాణి, వల్లూరు శివప్రసాద్, నాళేశ్వరం శంకరం, తంగిరాల చక్రపాణి, పల్లె నర్సింహ పాల్గొన్నారు.

## హామీలు ఇస్తారు కానీ అమలు కావు

- పసుపు రైతులే బీజేపీని బొంద పెడుతారు
- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్

సిటీబ్యూరో, అక్టోబర్ 1 : మహబూబ్‌నగర్‌లో ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు ఎన్నికల హామీలే తప్ప ఆచరణలో అమలయ్యే హామీలు కావని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ డిపాజిట్లు సైతం రావని తెలిసి ఇప్పుడు పసుపు బోర్డు పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఒక ప్రకటనలో ఆయన మండిపడ్డారు. 'ఏరు దాటే దాక ఓడ మల్లన్న ఏరు దాటినంక బోడ మల్లన్న' అన్నట్టు ఎన్నికల తరువాత తెలంగాణ ప్రజలను టూరిస్టు నేతలు పట్టించుకోరని విమర్శించారు. తెలంగాణకు పసుపు బోర్డు మీద రోజుకో మాట మాట్లాడే బీజేపీ నేతలు, పసుపు బోర్డు పాల అంబాసిడర్ కారు లాంటిదని, అందుకు స్పైసీ బోర్డు తీసుకు వస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు ఎన్నికలు ఉండటంతో రైతుల ఓటు బ్యాంకు కోసం మళ్లీ పసుపు బోర్డు అంటూ కొత్త నాటకానికి తెర తీశారని విమర్శించారు. ఎన్ని దొంగ నాటకాలు ఆడినా నిజామాబాద్ పసుపు రైతులే దగ్గరుండి అరవింద్‌ని ఇంటికి పంపిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## ఓట్ల కోసమే మోదీ హామీలు



తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 1 : మహబూబ్‌నగర్ పట్టణంలో పర్యటించిన ప్రధాని మోదీ గిరిజన యూనివర్సిటీ, పసుపు బోర్డుపై చేసిన హామీలు ఎన్నికలప్పుడు కేవలం ఓట్ల కోసం మాత్రమేనని బీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగ బాలు మండిపడ్డారు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ ఈ అంశాలు ఏనాడూ గుర్తుకు రాకుండా ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. దేశానికి ఆదాయం అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉన్నదని, తెలంగాణ నుంచి రూపాయి తీసుకుంటూ ఇచ్చేది అణా కూడా లేదని దుయ్యబట్టారు. బీజేపీతో తెలంగాణ ప్రజలకు ఒరిగేదేమీ లేదని వారికి తెలుసన్నారు.

## నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి

### బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం



జ్యోతి ప్రజ్వలన చేసి సైమా-2023 ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

కంటోన్మెంట్, అక్టోబర్ 1 : విశ్వనగరంగా పేరుగాంచిన నగరం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక చొరవతో ప్రతి రంగం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. నగరాభివృద్ధిలో మంత్రి కేటీఆర్ పాత్ర ఎంతో క్రియాశీలకమైందన్నారు. ఆదివారం సికింద్రాబాద్ బాలంరాయి పరిధిలోని క్లాసిక్ గార్డెన్స్‌లో సైమా-2023 ఎక్స్‌పోను డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు జ్యోతివెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైమా అధ్యక్షుడు మోక్ష, డైరెక్టర్ ప్రతిమరాజ్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. అతిథులుగా జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి, ప్రొఫెసర్ రేఖారావ్, పూజ గుప్తా, నర్మదా, కవిత, సంధ్య, అయాన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఎక్స్‌పోను ప్రారంభించిన అనంతరం అతిథులు స్టాల్స్‌ను సందర్శించి ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్రా కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరుకు ప్రాణం పోసిన సీఎం కేసీఆర్



యువ కవి మిద్దె సురేశ్‌ను సన్మానిస్తున్న కవులు, రచయితలు

సిటీబ్యూరో, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఉమ్మడి పాలమూరు జిల్లాలో కవిసమ్మేళనం నిర్వహించారు. నగరంలోని చిక్కడపల్లికి చెందిన యువ కవి మిద్దె సురేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొని తన కవిత్వాన్ని వినిపించారు. ఒకప్పుడు నీళ్లులేని కరువు జిల్లా అయిన పాలమూరుకు కృష్ణమ్మ నీళ్లను పారించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని సురేశ్ పేర్కొన్నారు. తడి ఆరిన గొంతులో కృష్ణమ్మ నీళ్లను ఒలికించి ప్రాణం పోసిన సీఎం కేసీఆర్‌కు పాలమూరు బిడ్డలు ప్రణమిల్లుతారని తెలిపారు. ఆయన కవిత్వానికి గాను మహబూబ్‌నగర్‌లోని కవులు, రచయితలు వేదికపై ప్రశంసలు కురిపించారు. జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు.